'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ట్రంప్ విజయం

ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికలు మన దేశంలో అనూహ్యమైన స్థాయిలో ఆసక్తిని కలిగించాయి. అమెరికా రాజకీయాల శిఖరాగ్రాన భారతీయం వెలిగిపోతుండటమే అందుకు కారణం. రిపబ్లికన్, డెమొక్రాట్ వైరిపక్షాల్లో ఎవరు గెలిచినా సంబురాలు జరుపుకొనే గమ్మత్తయిన పరిస్థితి నెలకొన్నదిక్కడ. తమిళ మూలాలు కలిగిన కమలా హ్యారిస్ డెమొక్రాటిక్ అభ్యర్థిగా ముందుకు రావడం పెద్ద పరిణామమే. కానీ, కథ కంచికి చేరలేకపోయింది. ఆమె గట్టిపోటీ ఇచ్చినా గట్టెక్కలేకపోయారు. అమెరికా పరిపాలనా పగ్గాలు మహిళల చేతికి వచ్చే అవకాశం చేజారిన రెండో సందర్భమిది. ఇదివరకు హిల్లరీ క్లింటన్, ఇప్పుడు కమల ఓటమి పాలయ్యారు. ఇద్దరినీ ఓడించింది ఒక్కరే కావడం విశేషం. ఉత్కంఠ భరితంగా సాగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం పూర్తిగా ఊహించనిదేమీ కాదు. పోలింగ్ దగ్గర పడుతున్నకొద్దీ పారిశ్రామిక, వాణిజ్యవర్గాలు రిపబ్లికన్ వైపు మొగ్గు చూపడం, మీడియాలో అనుకూల కథనాలు వెల్లువెత్తడం గమనించినవారికి రాబోయే ఫలితాల గురించి ముందస్తుగానే అవగాహన ఏర్పడింది. ట్రంప్‌ను గెలిపించేందుకు టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ చేసిన హంగామా ఈసారి ఎన్నికల హైలైట్‌గా నిలవడం గమనార్హం. ట్రంప్‌తో జట్టు కట్టి ఉపాధ్యక్షునిగా ఎన్నికైన వాన్స్ సతీమణి ఉషా చిలుకూరి... ఏపీ ఆడబిడ్డ కావడం కొసమెరుపు.

భారత్-అమెరికా సంబంధాల మీద ట్రంప్ విజయం ఎలాంటి ప్రభావాలు చూపుతుంది? అనేది ఇప్పుడు అందరి మెదళ్లలో మెదులుతున్న ప్రశ్న. ఆయన భారతీయులకు అపరిచితుడేమీ కాదు. ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీకి గల సాన్నిహిత్యం జగమెరిగినదే. తొలివిడత పదవీకాలంలో 'హౌడీ మోడీ', 'నమస్తే ట్రంప్' వంటి ఆర్భాట ప్రచార కార్యక్రమాల్లో ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. అయితే ఈ సాన్నిహిత్యం ద్వైపాక్షికంగా భారత్‌కు ఏ మేరకు లబ్ధి కలిగిస్తుందనేది ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే, ట్రంప్ మొదటినుంచీ 'అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం' అన్న విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇది రెండు దేశాల వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. భారతీయ సుంకాలు అధికంగా ఉన్నాయని, తాను గెలిస్తే ప్రతీకార సుంకాలు వేస్తానని ఎన్నికల ప్రసంగాల్లో ట్రంప్ హెచ్చరించడం తెలిసిందే. ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్ రంగాలపై ఈ ధోరణి ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయి. డాలర్ మారకానికి ముకుతాడు వేయాలని బ్రిక్స్ వేదికగా భారత్ చేస్తున్న ప్రయత్నాలు రెండు దేశాల మధ్య పొరపొచ్చాలు తేవచ్చు. భారతీయుల డాలర్ కలలకు ట్రంప్ ఏ మాత్రం సానుకూలం కాదనేదీ గుర్తుంచుకోవాలి. అమెరికన్ల ఉపాధి రక్షణకు వలసలను నిరోధించాలనే ఆలోచనతో వీసాలకు కోతపెట్టిన చరిత్ర ఆయనది.

రెండు అధ్యక్ష ఎన్నికల మధ్యకాలంలో ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో భీకర యుద్ధం రాజుకున్నది. గాజాలో ఇజ్రాయెల్ నరమేధంతో పాలస్తీనీయుల పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. మరోవైపు పర్యావరణం శిథిలం కావడం వల్ల వాతావరణం వేడెక్కి ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. వీటన్నిటిపై ట్రంప్ వైఖరి ఏమిటని ఆలోచిస్తే అంత సానుకూలతలేమీ ఉండకపోవచ్చనే సమాధానం వస్తుంది. ఎందుకంటే బయటి సమస్యల్లో అమెరికా ఎక్కువగా ఇరుక్కుపోవద్దని భావించే ట్రంప్ అనేక అంతర్జాతీయ ఒప్పందాలను గతంలో బుట్టదాఖలు చేసిన సందర్భాలున్నాయి. ఇరాన్ అణు ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడం అందుకు పెద్ద ఉదాహరణ. ఇక భూతాపం వంటి సమస్యలపైనా ట్రంప్ విధానాలు తెలిసినవే. అసలు అవి పూర్తిగా ఊహాకల్పిత సమస్యలని, దేనిలోనూ అమెరికా జవాబుదారీతనాన్ని తీసుకోవాల్సిన అవసరం లేదనేది ట్రంప్ విధానం. గతంలో కాప్ సదస్సుల్లో ఇది వివాదాలకు కారణమైంది. ఇవన్నీ మొదటి విడతలో అనుసరించిన విధానాలు. ఇప్పుడు నాలుగేండ్ల విరామం తర్వాత మరోసారి అధ్యక్ష పదవి చేపడుతున్న ట్రంప్ పరిపాలనలో మార్పులుంటాయా? అనేది త్వరలో తేలిపోతుంది.

ఫార్ములా ఈ-రేస్... ఇవిగో నిజాలు

అర్జున్

రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జరుగుతున్న అతి పెద్ద చర్చ ఫార్ములా ఈ-రేస్. ఈ కేసును అడ్డం పెట్టుకొని రేవంత్ సర్కారు పురపాలక శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేస్తారంటూ కాంగ్రెస్ అనుకూల మీడియా రోజుకో కథనం వండి వారుస్తున్నది. 11 నెలల కిందట కొలువుదీరిన రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చీరాగానే ఫార్ములా ఈ -రేస్‌తో రాష్ట్రానికి కలిగే ప్రయోజనం సున్నా అంటూ ఈ రేసింగ్ పోటీలను నిర్వహించే కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. గత డిసెంబర్‌లోనే ఈ-రేస్‌పై కొత్తగా కొలువుదీరిన సర్కారులోని మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు రకరకాల వ్యాఖ్యలు చేశారు. భారీ కుంభకోణం జరిగిందని మాట్లాడారు. కానీ, 11 నెలల్లో వాళ్లు ఒక్కటంటే ఒక్క ఆధారాన్ని కూడా బయట పెట్టలేకపోయారు.

రేవంత్ సర్కారు ప్రభ క్రమక్రమంగా మసకబారుతుండటం, ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక ఆపసోపాలు పడుతున్న నేపథ్యంలో తాజాగా మరోసారి ఫార్ములా ఈ-రేస్ అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చినట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో విఫలమైనప్పుడు, అనుకున్న ఫలితాలు సాధించలేనప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించడం ఇటీవల కాలంలో పెరిగింది. ముఖ్యంగా ఈ రేవంత్ సర్కారులో డైవర్షన్ పాలిటిక్స్ మరీ ఎక్కువయ్యాయన్నది కండ్లముందు కనిపిస్తున్న వాస్తవం.

అసలేమిటీ ఫార్ములా ఈ-రేస్?

మోటారు కార్లు, వాహనాలు వెదజల్లే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వీటిపై చైతన్యం కలిగించడం, పర్యావరణాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఫార్ములా ఈ-రేస్ నిర్వహిస్తుంటారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ పోటీలు నిర్వహించే అవకాశం మన తెలంగాణ రాష్ట్రానికి దక్కింది. దీని కోసం నాటి కేసీఆర్ సర్కారు పెద్ద కసరత్తే చేసింది. ప్రపంచంలోనే అత్యంత పేరున్న 'ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్' (ఎఫ్ఐఏ) ఈ ఫార్ములా ఈ-రేస్ నిర్వహించింది. గతంలో టోక్యో, షాంఘై, బెర్లిన్, మొనాకో, లండన్ వంటి నగరాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ నగరాల సరసన హైదరాబాద్ నిలవాలన్న సదుద్దేశంతో, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం ఫార్ములా ఈ-రేస్ నిర్వహించే సంస్థలను సంప్రదించింది. హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వహించేలా నిర్వాహకులను నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, నాటి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్‌లు ఒప్పించారు. వాహన రంగంలో వస్తున్న మార్పులను హైదరాబాద్ ప్రజలకు పరిచయం చేసేందుకు... కాలుష్య రహిత మోటార్లతో కూడిన కార్ల రేసును నగరంలో నిర్వహించారు. ఫార్ములా ఈ-రేస్ 9వ సీజన్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చింది. 2023 ఫిబ్రవరి 5-11వ తేదీ మధ్య తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించి ఈ-మొబిలిటి వారంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ-మొబిలిటి వారం సందర్భంగా ఫార్ములా ఈ-రేస్ ఏర్పాటుచేశారు.

2023, ఫిబ్రవరి 11న తొమ్మిదో సీజన్‌కు సంబంధించిన నాలుగో రేస్ హైదరాబాద్‌లోని హుసేన్‌సాగర్ తీరంలో జరిగింది. దీనికి ముందు ఈ-రేస్‌పై దేశ ప్రజలకు అవగాహన కలిగించేందుకు కౌంట్‌డౌన్ పేరుతో కార్యక్రమాలు కూడా దేశవ్యాప్తంగా నిర్వహించారు. ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద అట్టహాసంగా జరిగిన కౌంట్‌డౌన్ కార్యక్రమానికి అప్పటి, ఇప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తదితరులు హాజరయ్యారు.

అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. కేంద్రంలో ఆనాడు ఉన్నది బీజేపీ సర్కార్, మహారాష్ట్రలో ఆనాడు ఉన్నది బీజేపీ సంకీర్ణ ప్రభుత్వమన్నది మనం ఇక్కడ గమనించాలి. హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈ-రేస్‌లో 11 జట్లు పాల్గొన్నాయి. మొత్తంగా ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉండే 22 బ్రాండ్ల ఎలక్ట్రిక్ కార్లు ఈ రేసులో పాల్గొన్నాయి. మెక్‌లారెన్, మసారెటీ, మహీంద్ర, జాగ్వార్, పోర్షె, నిస్సాన్ వంటి బ్రాండ్ల కార్లు వచ్చాయి. జెన్ 3 కార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలక్ట్రిక్ కార్లు కూడా గంటకు 322 కిలోమీటర్ల స్పీడ్‌తో దూసుకొనిపోగలవని ప్రజలకు వివరించేలా వాహనాలను తీసుకువచ్చారు. దీనిద్వారా ఎలక్ట్రిక్ వాహనాలంటే ఉండే అపోహను దూరం చేసినట్టవుతుందని నిర్వాహకులు భావించారు.

150 దేశాలు వీక్షించాయి

2014 నుంచి జరుగుతున్న ఫార్ములా ఈ-రేస్ అత్యంత ప్రత్యేకమైనది. అంతకుముందు కార్ల రేసు అంటే ప్రత్యేకమైన ఇంధనంతో మాత్రమే రేస్ నిర్వహించేవారు. ఇంధనం స్థానంలో బ్యాటరీతో కూడిన వాహనాలను ఉపయోగించి పోటీ నిర్వహించి, బ్యాటరీల సామర్థ్యం ఎలా ఉంటుందో వివరించేందుకు ఈ-రేస్‌లు ఉపయోగపడుతున్నాయి. 2020లో ఫార్ములా ఈ-రేస్‌కు ప్రపంచ రేసింగ్ హోదాను ఎఫ్ఐఏ ఇచ్చింది. ఫార్ములా ఈ-రేస్ కోసం బుక్ మై షోలో టిక్కెట్లను ఉంచితే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఎలక్ట్రిక్ కార్లు దూసుకుపోవడాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చినవారున్నారు. రేస్ జరిగిన రెండు రోజులు హుసేన్‌సాగర్ జనసంద్రాన్ని తలపించింది. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లోని కార్ల ప్రేమికులు ఈ-రేస్‌ను ప్రత్యక్ష ప్రసారాలు, వివిధ మాధ్యమాల ద్వారా వీక్షించారంటే ఆషామాషీ వ్యవహారం కాదు. మన దేశంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ సహా అనేక మంది క్రీడాకారులు, సినిమా, పారిశ్రామిక ప్రముఖులు వచ్చారు. 31 వేల మంది రేస్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు వస్తే... వీళ్లలో సగం మంది బయటి రాష్ట్రాలు, దేశాల నుంచే వచ్చినట్టు నిర్వాహకులు అదేరోజు ప్రకటించిన విషయాన్ని ఒక్కసారి మనం గుర్తుచేసుకుందాం.

తెలంగాణకు రూ.700 కోట్ల పెట్టుబడుల లబ్ధి

ఫార్ములా ఈ-రేస్ నిర్వహణతో ప్రపంచదేశాల సరసన హైదరాబాద్ చేరినట్టయింది. ప్రపంచంలోని టాప్-25 నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచినట్టు అనేక సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ-రేస్ జరిగిన తర్వాత ఈ-రేస్ ప్రభావంపై నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్ అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలో హైదరాబాద్ ఆర్థికానికి ఫార్ములా ఈ-రేస్‌తో లబ్ధి చేకూరినట్టు గుర్తించింది.

సుమారు రూ.700 కోట్ల మేర ఆర్థిక లబ్ధి తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి వచ్చినట్టు నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్ సంస్థ తన నివేదికలో పేర్కొన్నది. హైదరాబాద్ ఆతిథ్య నగరంగా గొప్ప పేరును సంపాదించుకున్నదని కూడా ఆ సంస్థ చెప్పింది. ఫార్ములా ఈ-రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరగడమే కాదు, ఆర్థిక రంగానికి కూడా ఊతమిచ్చిందన్నది వాస్తవం. నీల్సన్ సంస్థ ఇప్పుడు ఇచ్చిన నివేదిక కాదిది. రేస్ జరిగిన తర్వాత ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి అధ్యయనాలను ఆ సంస్థ నిర్వహిస్తూ ఉంటుంది.

అంతర్జాతీయ స్థాయిలో నిర్వహణ... నిధులెక్కడికి పోయినట్టు?

తెలంగాణ ప్రభుత్వం ఈ రేస్‌ను ప్రపంచ స్థాయిలో నిర్వహించింది. ప్రపంచంలోని అగ్రదేశాల్లో ఏ విధంగా అయితే నిర్వహిస్తారో.. అదే స్థాయిలో హైదరాబాద్‌లో అప్పటి ప్రభుత్వం నిర్వహించింది. మీడియా, సోషల్ మీడియా సహా అనేక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఏర్పాట్లు అదరహో అని అభిమానులు కొనియాడారు. నిర్వాహకులు కూడా కేసీఆర్ సర్కార్‌ను ప్రశంసించారు. ప్రభుత్వం ఈ రేస్ నిర్వహణ కోసం ఒప్పందం చేసుకోవడంతో పాటు నిర్వహణకు ప్రత్యేకంగా కమిటీలను కూడా ఏర్పాటుచేసింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, జీహెచ్ఎంసీ అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు, రెవెన్యూ, జలమండలి, విద్యుత్తు తదితర శాఖల అధికారులతో ఒక కమిటీని, పురపాలక శాఖ మంత్రి చైర్మన్‌గా మరో కమిటీని ఏర్పాటు చేసింది. పురపాలక శాఖ మంత్రి చైర్మన్‌గా ఉన్న కమిటీలో మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర, మహీంద్రా రేసింగ్ టీమ్ సీఈవో దిల్‌బాగ్ గిల్, ఎఫ్ఐఏకు చెందిన ప్రతినిధి, రేసింగ్‌లో అనుభవం ఉన్న మరో ముగ్గురు కూడా సభ్యులుగా ఉన్నారు. రేస్ నిర్వహణను ఈ కమిటీ పర్యవేక్షించింది. మొత్తం నాలుగు సార్లు ఇక్కడే రేస్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదట ఒప్పందం చేసుకున్నది. అయితే, తొలి రేస్‌కు గ్రీన్‌కో సహా పలు సంస్థలు స్పాన్సర్‌షిప్ ఇచ్చాయి. తర్వాత ఏడాది ఫిబ్రవరిలో జరిగే రేస్ విషయంలో స్పాన్సర్ల సమస్య వచ్చింది.

స్పాన్సర్లు రాకపోవడంతో తాము రేస్ నిర్వహించలేమని ఎఫ్ఐఏ ప్రతినిధులు అనాడు రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పారు. ఇదంతా అసెంబ్లీ ఎన్నికల ముందు జూన్-జూలై మధ్య జరిగింది. అయితే, ఫిబ్రవరి నాటికి తాము స్పాన్సర్లను చూస్తామని, అప్పటివరకు హెచ్ఎండీఏ నుంచి రూ.50 కోట్ల నిధులను నిర్వహణ కోసం కేటాయిస్తామని అనాటి పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ నిర్వాహకులకు హామీ ఇచ్చి రేస్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

ఈ మేరకు హెచ్ఎండీఏ నుంచి నిధులు ఇచ్చారు. రేస్ నిర్వహణలో హెచ్ఎండీఏ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించింది. అందుకే నిధులను అక్కడి నుంచి ఇచ్చారు. రేస్ జరుగుతుందన్న ఉద్దేశంతో నాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. హెచ్ఎండీఏ స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థ. దీనికి చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్మన్‌గా పురపాలక శాఖ మంత్రి ఉంటారు. అందుకే ఇక్కడి నుంచి ఇచ్చే నిధులకు రాష్ట్ర ఆర్థిక శాఖతో సంబంధం లేదు. హెచ్ఎండీఏ నుంచి విడుదల చేసిన నిధులను రేస్ నిర్వహించే సంస్థ ఖాతాకే పంపించారు. ఇక్కడ ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదు. ఒకవేళ అనుకున్న ప్రకారం రేస్ జరిగి ఉంటే నిధుల కేటాయింపు అన్నదానిపై అసలు చర్చనే ఉండదు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్ములా ఈ-రేస్‌ను రద్దుచేసింది. డిసెంబర్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. దీంతో 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ రేస్ రద్దయ్యింది. ప్రభుత్వం ఈ రేస్ నుంచి వైదొలగడంతో ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ సంస్థ తనకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన నిధులను వెనక్కి ఇవ్వలేదు. 'మీరు రేస్ నిర్వహిస్తే మేం వచ్చేవాళ్లం కదా' అన్నది ఆ సంస్థ వాదన. ఇక్కడ నిధుల దుర్వినియోగం లేదా కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టు మనీలాండరింగ్ అన్న ముచ్చటే లేదు. ప్రభుత్వం ఒప్పందం నుంచి వెనక్కి మళ్లడంతో రేస్ నిర్వహణ సంస్థ ఒప్పందం ప్రకారం నిధులను తిరిగివ్వలేదు. ఈ రేస్ నిర్వహణ ఏదో గుట్టుచప్పుడు కాకుండా 'మమ' అనిపించి నిధులను జేబులో వేసుకున్నారన్నట్టు ప్రచారం చేస్తున్నారు. రూ.50 కోట్ల నిధుల్లోంచి ఆనాటి మంత్రి కేటీఆర్‌కో, లేదా బీఆర్ఎస్ పార్టీకో ఒక్క రూపాయి కూడా వెళ్లలేదు. వాస్తవానికి రేవంత్ సర్కార్ ఒప్పందం నుంచి వెనక్కి వెళ్లాలన్న మూర్ఖపు నిర్ణయంతో ఫార్ములా ఈ-రేస్ నిర్వాహకులకు లబ్ధి చేకూర్చినట్టయింది.

ఇంటర్ కాంటినెంటల్ కప్ కోసం నిధుల దుర్వినియోగం చేసిందెవ్వరు?:

ఈ రేస్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ సర్కారు పెద్దలు వచ్చీరాగానే హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇది కనీసం పట్టుమని నాలుగు వందల మంది కూడా చూసింది లేదు. ఫుట్‌బాల్ ఆటకు కూడా ఉపయోగపడిందేమీ లేదు. ఇంటర్ కాంటినెంటల్ కప్ పేరుతో ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. ఇండియా, మారిషస్, సిరియా దేశాల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరిగాయి. ఆ మ్యాచ్‌లకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చింది. దీనికోసం అక్షరాలా రూ.20 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసింది. గచ్చిబౌలి స్టేడియానికి మరమ్మతులు చేసింది. ఫుట్‌బాల్ మ్యాచ్‌ల పేరుతో రూ.20 కోట్లతో మరమ్మతులు చేసి.. మూడు మ్యాచ్‌లు ఆడిపించిన ప్రభుత్వం ఆ తర్వాత వెంటనే సినిమా పాటల కచేరికి స్టేడియాన్ని అప్పగించింది. ఈ నిర్వాకం నిధుల దుర్వినియోగం కిందికి రాదా? అన్న ప్రశ్న ఉదయిస్తున్నది.

కేటీఆర్‌పై కక్ష సాధింపు.. బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకే..

'ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతి' అంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బురద జల్లడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడం, తద్వారా పెట్టుబడులను ఆకర్షించేందుకు నాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయ కక్ష సాధింపు కోసం వాడుకోవాలని చూస్తున్నది. 11 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆకాంక్షలను ఏ మాత్రం ప్రతిబింబించలేని ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఏదో ఒక విధంగా కేటీఆర్‌ను బద్నాం చేయాలన్న లక్ష్యంతో సాగుతున్నారు. ఇప్పటికే విద్యుత్ కమిషన్, కాళేశ్వరం కమిషన్‌లను వేసిన ప్రభుత్వం.. ఏమీ సాధించలేకపోయింది. తాజాగా ఈ-రేసు అంశాన్ని తెరమీదికి తెస్తున్నది. కాంగ్రెస్ చేస్తున్న ఈ అరాచకాలను రాష్ట్ర ప్రజలు నిశ్శబ్దంగా గమనిస్తున్నారు.

రాజకీయ కక్షతో చేసే ఏ పనినీ తెలంగాణ ప్రజలు హర్షించరనేది చారిత్రక సత్యం.

పోటీపడ్డ ముంబై

ఫార్ములా ఈ-రేస్‌ను తమ రాష్ట్రంలో నిర్వహించాలని సాక్షాత్తూ మహారాష్ట్ర నిర్వాహకులతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కోరారు. ముంబైలోని సమృద్ధి హైవేపై నిర్వహించే అవకాశం ఉన్నదని, రోడ్లు బాగున్నాయని, ఫార్ములా ఈ-రేస్ వంటిది వస్తే ముంబై ఇమేజ్ పెరుగుతుందని ఆయన గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కౌంట్‌డౌన్ కార్యక్రమంలో అభ్యర్థించారు. హైదరాబాద్‌లో రేస్ నిర్వహిస్తున్నారని, తాము కూడా పోటీ పడతామని, ముంబై వాసులకు ఈ రేస్ చూపిస్తామని ఆయన ఆనాడు వ్యాఖ్యానించడం గమనార్హం.

తెలంగాణ ఎవుసానికి సుస్తీ

ఉమ్మడి రాష్ట్రంలో వలస పాలన ఒక చీకటి యుగం. నాడు తెలంగాణ వెతలు అన్నీ ఇన్నీ కావు. మలి ముఖ్యంగా ఎవుసం కునారిల్లింది. ఉమ్మడి పాలకులు సవతి తల్లి ప్రేమను చూపడంతో చెరువులు, కుంటలు, కాలువలపై ఆధారపడి సాగు చేసుకునే తెలంగాణ రైతాంగం తల్లడిల్లింది. అప్పులపాలై వేల మంది అన్నదాతలు తనువు చాలించారు. నాటి చీకటి యుగాన్ని మరిచిపోయి కేసీఆర్ హయాంలో రైతన్నలు స్వర్ణ యుగాన్ని అనుభవిస్తున్న సమయంలో కాంగ్రెస్ రూపంలో మళ్లీ ఉపద్రవం ముంచుకొచ్చింది. వస్తూనే నాటి చీకటి రోజులను మళ్లీ తీసుకొచ్చింది.

స్వరాష్ట్రం సిద్ధించాక అధికారం పీఠమెక్కిన ఉద్యమ నేత కేసీఆర్ వెనువెంటనే వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించారు. మోడువారిన అన్నదాతల బతుకుల్లో వెలుగులు నింపేందుకు 25కు పైగా వ్యవసాయ సంబంధిత సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేశారు. ఎవుసానికి 24 గంటల ఉచిత విద్యుత్తుతో మొదలైన ఈ పథకాల పరంపర మహాయజ్ఞంలా సాగింది. రైతుబంధు, రైతు భరోసా, కాళేశ్వరం జలాలు, చెరువులు, కుంటల పునరుద్ధరణ, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రుణమాఫీ, నీటితీరువా రద్దు, ఎరువులు, నాణ్యమైన విత్తనాల పంపిణీ, సమీకృత మార్కెట్ల ఏర్పాటు, రైతు వేదికలు, గోదాముల నిర్మాణం, రైతు మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు, భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన తదితర కార్యక్రమాలను చేపట్టిన కేసీఆర్ సర్కార్ అన్నదాతల బతుకులను సమూలంగా మార్చేసింది. అంతేకాదు, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, పాడి రైతులకు ప్రోత్సాహం, సంచార పశు వైద్యశాలలు, సబ్సిడీపై ట్రాక్టర్ల కొనుగోలు లాంటి కార్యక్రమాలతో వ్యవసాయ అనుబంధ రంగాల రూపమే మారింది. ఫలితంగా ఒకప్పటి ఆకలికేకల తెలంగాణ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఎదిగింది.

కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన పథకాల మూలంగా 2014లో దాదాపు కోటి ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం.. 2023 నాటికి సుమారు 2 కోట్ల ఎకరాలకు చేరుకున్నది. 68 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి.. 3 కోట్ల మెట్రిక్ టన్నులకు ఎగబాకింది. 9 ఏండ్లలో రైతాంగం బాగు కోసం కేసీఆర్ సర్కార్ రూ.4.50 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసింది. రైతుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం.

వందల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కొత్తగా ఏమీ చేయకపోగా ఉన్న పథకాలకు ఎసరు పెట్టింది. రైతుబంధును ఎగ్గొట్టింది. రుణమాఫీకి కోతలు పెట్టింది. రైతుబీమాను అటకెక్కించింది. మొత్తంగా ఎవుసం నడ్డి విరిచేసింది. ఫలితంగా తెలంగాణ రైతాంగానికి సుస్తీ చేసింది.

అధికారంలోకి వచ్చాక రూ.41 వేల కోట్ల రైతు రుణాలున్నట్టు మొదట అంచనా వేసిన కాంగ్రెస్ సర్కార్ ఆఖరికి రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేయడం అత్యంత దారుణం. రేవంత్ సర్కార్ నిర్వాకంతో రైతన్నలు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. రుణమాఫీ విషయంలో మోసం చేసిన కాంగ్రెస్ పాలకులు రైతు భరోసాకు కూడా ఎగనామం పెట్టారు. కేసీఆర్ తీసుకొచ్చిన మరో అద్భుత పథకం రైతు బీమాను కూడా కాంగ్రెస్ ఆగం పట్టించింది. ఈ పది నెలల్లో మరణించిన ఏ ఒక్క రైతు కుటుంబానికి కూడా రైతుబీమా కింద నయా పైసా ఇచ్చిన పాపాన పోలేదు. కేసీఆర్ హయాంలో ధాన్యం కొనుగోళ్లు పండుగలా సాగేవి. కానీ, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించలేదు. బోనస్ బోగస్‌గా మారగా.. మద్దతు ధర కూడా దక్కడం లేదు.

తొమ్మిదేండ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం రైతాంగానికి ఏ కష్టం రాకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నది. కష్టమన్నదే తెల్వకుండా రైతులు సాగు చేసుకున్నారు. కానీ, ఈ పది నెలల్లో అంతా తలకిందులైంది. నమ్మించి మోసం చేయడం తప్ప అన్నదాతలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు. రైతాంగ